

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శుక్రవారం 28 జూన్ 2024 | HYDERABAD




జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమ్రపాలిని మర్యాదపూర్వకంగా కలిసిన బల్దియా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సురేందర్ సింగ్ తదితరులు

- సిటీబ్యూరో, జూన్ 27(నమస్తే తెలంగాణ )

## మహంకాళి బోనాలకు ఇబ్బందులుండొద్దు

### జూలై 5 వరకు ఏర్పాట్లన్నీ పూర్తి కావాల్సిందే

**నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు .. సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్**

బేగంపేట, జూన్ 27: బోనాల ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో జూలై 5 వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బోనాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని, ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో జూలై 21, 22వ తేదీల్లో జరిగే మహంకాళి బోనాల జాతర ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జూలై 5లోపు జాతర ఏర్పాట్లు పూర్తయ్యే విధంగా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. 21న బోనాలు, 22న రంగం మహోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం రాష్ట్ర వ్యాప్తంగా ఉండటంతో మహిళలు జాతరకు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని, అందుకు తగినట్టు ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. ఈసారి బోనాల ఉత్సవాలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ప్రభుత్వం రూ. 20 కోట్లు విడుదల చేసిందన్నారు. ఆలయాల పరిసరాల్లో లైటింగ్, మూడు రోజుల పాటు నిరంతరం మంచినీటి సరఫరా, విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా పోలీసు అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ఏర్పాట్ల గురించి మంత్రికి వివరించారు. అంబారీపై అమ్మవారిని ఊరేగించే సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి సూచించారు. 500 మంది కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. అనంతరం మంత్రి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమా, జోనల్ కమిషనర్ రవికిరణ్, జలమండలి జీఎం వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గాడి తప్పిన పారిశుధ్యం

### ప్రశ్నార్థకంగా మారుతున్న ‘స్వచ్ఛ హైదరాబాద్’
### నీరుగారిన ఇంటింటి చెత్త సేకరణ
### రహదారులపై పేరుకుపోతున్న వ్యర్థాలు
### దోమల విజృంభణ.. ప్రబలుతున్న డెంగీ

సిటీబ్యూరో, జూన్ 27 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతోంది..స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపుతామన్న లక్ష్యం నీరుగారుతోంది. గడిచిన కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా.. రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి..తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/ జీవీపీ) జీహెచ్ఎంసీ పరిధిలో 2640 ప్రాంతాలను గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో వీటికి అదనంగా కొత్తగా జీవీపీ పాయింట్లు పుట్టుకొస్తున్నాయి. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే పారిశుధ్యంపై ఫిర్యాదులు అధికం కావడం, ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వయంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగులేదని, తన డివిజన్‌లో చెత్త ఎత్తడం లేదని సంబంధిత జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గత సోమవారం ఐఏఎస్‌ల బదిలీల సందర్భంలో పారిశుధ్య విభాగం అదనపు కమిషనర్ (నాన్ క్యాడర్) ఉపేందర్‌రెడ్డిని ప్రభుత్వం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బదిలీ చేసింది. నాలుగు రోజులు గడిచినప్పటికీ కీలకమైన ఈ స్థానాన్ని ఎవరికీ అప్పగించలేదు. ఇదిలా ఉంటే గడిచిన నాలుగు రోజులుగా పారిశుధ్య విభాగానికి బాధ్యతలు స్వీకరించేందుకు అదనపు కమిషనర్లు ముందుకు రావడం లేదు. శానిటేషన్ విభాగం బాధ్యతలు మాకొద్దు బాబోయ్ అంటూ దూరంగా ఉంటున్నారు. కేంద్ర కార్యాలయంలో ఉన్న ఉన్నతాధికారులు సైతం పారిశుధ్యం విభాగం మాకొద్దు అంటున్నారు.

#### అసలే వర్షాకాలం.. ఆపై దోమలు..

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ 10 రోజుల పాటు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లడం, ఈ స్థానంలో ఇన్‌చార్జి జోనల్ కమిషనర్‌గా పంకజకు అప్పగించారు. కానీ పారిశుధ్య విభాగానికి మాత్రం అదనపు కమిషనర్‌ను నియమించలేదు. ఈ స్థానాన్ని సమర్థవంతమైన అధికారితో భర్తీ చేయడం, పారిశుధ్య నిర్వహణను మళ్లీ గాడిలో పెట్టడం కొత్త కమిషనర్ ఆమ్రపాలికి సవాల్‌గా మారింది. ఇటీవల కొత్తగా వచ్చిన జోనల్ కమిషనర్లు సైతం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లకపోవడంతో చాలా ప్రాంతాల్లో చెత్త నగరంగా హైదరాబాద్ దర్శనమిస్తున్నది. అసలే వర్షాకాలం, ఆపై దోమల విజృంభణ, డెంగీ వ్యాధులు వెరసి ప్రజల ప్రాణాలతో జీహెచ్ఎంసీ చెలగాటం ఆడుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సైతం క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయక.. లోపాలను సరిదిద్దలేక పారిశుధ్య విభాగాన్ని గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

#### స్వచ్ఛ ఆటోలపై పర్యవేక్షణ ఏదీ?

గేటర్‌లో చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా దాదాపు మూడున్నరేండ్ల కిందట డస్ట్ బిన్ లెస్ సిటీ పేరుతో చెత్త కుండీలను జీహెచ్ఎంసీ ఎత్తేసింది. వందకు వంద శాతం ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచారు. సుమారు 5250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కొక్క అటో కు సుమారుగా 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి, చెత్త సేకరణ జరపాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా ఉండడం లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. రోజూ 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని స్వయంగా గత కమిషనర్ రోనాల్డ్ రాస్ గుర్తించారు. నేటికీ స్వచ్ఛ ఆటోల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించింది. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది.



#### అప్పట్లో మెరుగైన ర్యాంకులు

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టి మెరుగైన ర్యాంకులను సాధించింది. స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా తడి, పొడి చెత్త వేర్వేరు , ఇంటింటి నుంచి చెత్త సేకరణ కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల భాగస్వామ్యం, ఓడీఎఫ్‌కు చర్యలు, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ చర్యలు, స్వచ్ఛతపై చైతన్య కార్యక్రమాలు, 50 మైక్రాన్ల కన్నా తక్కువ నిడివి ఉన్న ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలు పక్కాగా చేపట్టింది. ప్రధానంగా చెత్త కుండీలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే క్రమంలో దాదాపు 22 లక్షల గృహాలకు ఒక్కో ఇంటికి తడి, పొడి చెత్త సేకరణకు 44 లక్షల చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణకు 4500 స్వచ్ఛ ఆటో టిప్పర్లను వినియోగించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, ఆధునిక వాహనాల వినియోగంతో వెరసి జీహెచ్ఎంసీకి ‘ బెస్ట్ సెల్ఫ్ సస్టైనబులిటీ అవార్డుతో పాటు, 3 స్టార్ రేటింగ్ సిటీగా నగరం నిలిచింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెత్త నిర్వహణ పూర్తి గాడి తప్పింది. పైగా పారిశుధ్య నిర్వహణ బాధ్యతలు స్వీకరించేందుకు ఏ ఒక్క అధికారి ముందుకు రాకపోవడం.. ఇప్పటి వరకు కీలక పోస్టును భర్తీ చేయకుండా ఉండటం జీహెచ్ఎంసీ పనితీరుకు అద్దంపడుతోంది.

## లోటస్ పాండ్ ఆక్రమణలపై ఆగ్రహం

**అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ ఈవీడీఎం కమిషనర్**

**కబ్జాదారు నార్నే గోకుల్‌పై క్రిమినల్ కేసు నమోదు**



లోటస్ పాండ్ బఫర్ జోన్‌ను పరిశీలిస్తున్న ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో: బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీని ఆనుకొని ఉన్న లోటస్ పాండ్ బఫర్ జోన్‌ను ఆక్రమించి నిర్మాణాలకు సిద్ధమైన కబ్జాదారుల భరతం పట్టింది జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగం. దాదాపు 2వేల గజాల వరకు స్థలాన్ని చదను చేసే ప్రయత్నంలో 500 గజాల వరకు పూర్తిగా భూమిని చదును చేశారు. దీనిపై స్థానికులు, ప్రకృతి ప్రేమికులు పెద్ద ఎత్తున జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్ లోటస్ పాండ్ బఫర్ జోన్ ఆక్రమణ ప్రాంతాన్ని పరిశీలించారు. జీహెచ్ఎంసీ నిర్మించిన కంపౌండ్ వాల్‌ను కూల్చివేసి , యథేచ్ఛగా కబ్జాకు పాల్పడుతుంటే ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారంటూ వారిపై రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి కబ్జాదారుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని రంగనాథ్ ఆదేశించిన దరిమిలా ఈవీడీఎం విభాగంలోకి అసిస్టెంట్ ఇంజినీర్ సుజిత్ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లోటస్‌పాండ్ పార్కులోకి చొరబడి చెట్లను నరికి, జీహెచ్ఎంసీ కంపౌండ్ వాల్‌ను కూల్చివేసి భూమిని చదును చేసి ఆక్రమించేందుకు యత్నించాడన్న కారణంతో నార్నే గోకుల్‌పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. రంగనాథ్ అధికారులతో కలిసి పర్యటిస్తున్న సందర్భంగా లోటస్‌పాండ్ సమీపంలో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి రంగనాథ్‌తో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.



ఐటీ కారిడార్‌లో భారీగా నిలిచిన ట్రాఫిక్



ఎంజే మార్కెట్ రోడ్‌లో..

## మరో మూడు రోజులు.. భారీ వర్షాలు

సిటీబ్యూరో: రుతుపవనాల ప్రభావంతో గురువారం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 9.30 గంటల వరకు హయత్‌నగర్‌లో 3.18, కాంచన్‌బాగ్‌లో 1.95, హస్తినాపురంలో 1.93, వనస్థలిపురం, చార్మినార్ ప్రాంతాల్లో 1.70, ఉప్పల్, బండ్లగూడ, పాతబస్తీ, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో చురుకుగా కదులుతున్న రుతుపవనాల ప్రభావంతో రాగల మరో మూడు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు.



బంజారాహిల్స్ రోడ్ నం. 12లో..

## విలీనంపై విమర్శలు

మేడ్చల్, జూన్ 27(నమస్తే తెలంగాణ): శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీ పరిధిలో విలీనం ప్రతిపాదనపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. శివారులో అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో పీర్జాదిగూడ, నిజాంపేట, బొడుప్పల్, జవహర్‌నగర్‌లను కార్పొరేషన్లగా.. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, తూంకుంట, దుండిగల్, కొంపల్లిలను మున్సిపాలిటీలుగా మార్చింది. అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మున్సిపాలిటీ, కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. శివారు ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఇదిలా ఉంటే జిల్లాలోని 13 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీ పరిధిలో విలీనం చేస్తే అభివృద్ధిని అడ్డుకున్నట్టేనని శివారు ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కాగా, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ద్వారా వస్తున్న ఆదాయంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు అంచనాలను రూపొందిస్తున్నట్లు తెలుస్తున్నది.



వాక్‌థాన్‌లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, రాచకొండ సీపీ తరుణ్‌జోషి తదితరులు

## సమష్టి కృషితోనే డ్రగ్స్ రహిత సమాజం

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక...ఫ్యాబ్ సిటీలో వాక్‌థాన్

రంగారెడ్డి, జూన్ 27 (నమస్తే తెలంగాణ):డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ, యువత, సమాజంలోని అన్ని వర్గాలు సమష్టిగా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్యాబ్ సిటీ ఆవరణలో జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, మెడికల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శశాంక, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజానికి పట్టిన చీడపురుగు వంటి డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరముందన్నారు. డ్రగ్స్ వినియోగం దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు సోషల్ మీడియాతోపాటు కళాశాలల్లో రాచకొండ కమిషనరేట్ ద్వారా ప్రభుత్వ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ మత్తు పదార్థాల బారిన పడటం వల్ల యువత బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. కార్యక్రమానికి ముందు కలెక్టర్ శశాంక, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వాక్‌థాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి, కందుకూర్ ఆర్డీఓ సూరజ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సందడి


